# వ్యాపారం అబ్బిరాలేదు

శాఖమూరి శ్రీనివాస్

‘అయ్యో రామా! ఏమిటీ దౌర్భాగ్యం. రోజూ ఏ పేపర్‌లో చూసినా కుంభకోణాలు, చావు వార్తలే తప్ప జనానికి ఉపయోగపడే అంశాలేమైనా వున్నాయా? చదవడం మానేస్తే సరి.’



పేపర్ మడిచి గిరాటేసే చివరి క్షణంలో ఆశా రాజు దృష్టిలో పడిందో ప్రకటన. కారుచీకటిలో కాంతిరేఖ మెరిసినట్లయింది. జాగ్రత్తగా దానిని చదివాడు. మొహం స్టేడియంలోని ఫ్లడ్‌లైట్‌లా మెరిసిపోయింది. అంతలోనే ఏదో నిరాశాబీజం చీకటిని నింపసాగింది.

'గతం'గుర్తుకొచ్చింది.

★★★

ఆశారాజు ఓ పల్లెటూరిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. 'చాలీచాలని జీతంతో ఎన్నాళ్లీ జీవితాన్ని ఎదుగుబొదుగు లేకుండా లాక్కెళ్లడం' అని మనసులో ఒకే చింతన. ఖాళీ సమయంలో ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. చాలా మార్గాలు ఆలోచించాక..... ఒక్క వ్యాపారం తప్ప తనకేదీ లాభాన్ని, సంతృప్తిని ఇవ్వదని గట్టిగా నమ్మాడు.

'ఏ వ్యాపారంలో కాలు మోపుదామా'.... అని ఆలోచించే సమయంలో పగిలిన ప్రత్తి కాయల్లో భవిష్యత్ మెరుపులు కనిపించాయి. పొలాల నిండా ధగధగ మెరుస్తోన్నప్రత్తి అతని లక్ష్యానికి దారులు పరిచింది. సీజన్‌లో ప్రత్తిని మిల్లులకు పంపడంలో బిజీ అయ్యాడు. ప్రత్తి కొనుగోలుదారులు మొత్తం డబ్బు ముందే ఇచ్చేవాళ్లు. ఎప్పుడైనా కాస్త తగ్గితే మాత్రం వెళ్లాక డిడి పంపేవారు. ఆరోజు ప్రత్తి కొన్నవాడి దగ్గర చిల్లిగవ్వ లేదు. "మాష్టారు... దొంగల భయం ఎక్కువైందని క్యాష్ తీసుకురా లేదు. వెళ్లగానే మీకు కొరియర్‌లో డిడి పంపుతాను " అన్నాడు వాడు.

"ఎప్పుడూ తీసుకువెళ్లేవాడే కదా!"అని ధీమాతో ఒప్పేసుకున్నాడు ఆశారాజు. మూడు నిండు లారీలతో వెళ్లినవాడు మూడు వారాలైనా పైకం పంపలేదు. రాజు గుండెల్లో చిన్న అలజడి ప్రారంభమైంది. ఫోన్ల మీద ఫోన్లు చేశాడు. " ఇవ్వాళ పంపుతున్నాను....రేపు పంపుతాను...." అంటూనే వున్నాడు వాడు. రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఆందోళనను అదుపు చేసుకుంటూనే గుంటూరులోని మిల్లుకు వెళ్లాడు ఆశా రాజు.

'సరుకు ఇచ్చి డబ్బులు పట్టుకెళ్లిపోయాడని, వాడికి మిల్లుతో సంబంధం లేదని'తేలింది. కన్‌ఫర్మ్ అయింది.... తను నిలువుగోతిలో పడ్డాడు. ఇప్పుడెలా? భూకంపం వచ్చి భూమి చీలికలో కూరుకుపోయినట్లయింది. ఏడుపును దిగమింగుకుంటూనే అప్పటి వరకూ వ్యాపారంలో సంపాదించిందంతా రైతులకు పంచేశాడు.

షాక్ నుంచి తేరుకోవడానికి చాలా రోజులు పట్టింది. కాలం మాన్పిన గాయాల నేపథ్యంలో తన దృష్టి మళ్లీ ఓ 'ప్రాజెక్టు'పై పడింది. అది వినూత్నం... అదే 'గొర్రెలు, పొట్టేళ్ల పెంపకం!' కళ్ల ముందే వాటి పెంపకం దార్లు లక్షలకు లక్షలు మూటగట్టడం రాజులో 'ప్రాప్త కాలజ్ఞత'ను కలిగించింది.

పెంపకందార్లను ఇంటర్వ్యూ చేసి సారాంశాన్ని ఫిల్టర్ చేసి... ఓ శుభముహూర్తాన ఓ పది పొట్టేళ్లను, ఐదు మేకలను కొనుగోలు చేశాడు. 'వాటిని ఎక్కడ! ఎలా పెంచాలి!' అన్న శంకలేవీ లేవు. ఎందుకంటే తన మదిలో వాటిని కొనకముందే పెంపకంపై ప్రణాళిక వుంది.

మరుసటి రోజు వాటిని తోలుకుని బడికి వెళ్లాడు. అక్కడ ఉన్న చింత చెట్టు వాటికి పగటి నివాసం అయింది. రాత్రి ఎలా! దీనికీ ప్రణాళిక వుంది.

ఏడవతరగతి చదివే విద్యార్థులకు తలా ఒక జీవాన్ని అప్పగించాడు. రాత్రంతా తమ ఇంట్లో వాటిని వుంచుకుని ఉదయాన్నే బడికి తీసుకురావాలి.... ఇంటర్వెల్‌లో వాటికి మేత, నీళ్లు పెట్టాలి. ఇదీ ఆర్డర్! పిల్లలు ఆయన ఆజ్ఞలను తు.చ.తప్పక పాటిస్తున్నారు. ఒక్క వారం గడిచింది.

బడికొచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ప్రధానోపాధ్యాయుడు ఆశారాజే! మిగతా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ పెట్టమని ప్రతిపాదన వుంచారు. వారి సూచన ప్రకారమే రాజు తల్లిదండ్రులను బడికి ఆహ్వానించాడు. ఎప్పుడు పిలిచినా ఒకరిద్దరు కంటే ఎక్కువ రారు. విచిత్రంగా ఈసారి భారీ సంఖ్యలో వచ్చారు. రాజు మనసు ఏదో అపశకునాన్ని సూచించింది. సమావేశం ప్రారంభమైంది.

"గ్రామస్తులందరికీ నమస్కారాలు...మిమ్మల్ని పిలిపించిన కారణం ఒక్కటే! ఈ మధ్య బడికి వచ్చే వారి సంఖ్య బాగా తగ్గుతోంది. వారిని పాఠశాలకు సరిగా పంపే బాధ్యత మీదే...."

రాజు మాటలకు అడ్డుపడుతూ..."మరి మీ బాధ్యతేమిటి? చదువు చెప్పడమేగా!" ఓ తండ్రి నిల్చుని అడిగాడు.


"అవును. అందులో సందేహమేముంది?"

మిగతా ఉపాధ్యాయులు ప్రమాదాన్ని ఊహించారు. లేచిన వ్యక్తిని కూర్చోమని సైగలు చేశారు. కానీ ఆయన వాటిని పట్టించుకోకుండానే, "చదువు నేర్పాల్సిన మీరు మేకలు, గొర్రెలు కాయిస్తుంటే....చదువంటే ఇంతేనేమో, ఇక బడికెందుకని ? అందరూ తమ పిల్లల్ని గొర్రెలు, బర్రెలు వెనుక తోలుతున్నారు."

అతని మాటలు రాజు గుండెల్లో తూటాల్లా దిగాయి. కాస్త తేరుకునే లోపే వచ్చినవారంతా ఒక్కుమ్మడిగా లేచి ఎవరికి తోచింది వారు మాట్లాడసాగారు. ఉపాధ్యాయుల రాజీ యత్నాలు, సముదాయింపులు కుదరలేదు. 'మాట్లాడింది చాలు, అవతల ఎన్నో పనులున్నాయంటూ' అంతా పొలాల వైపు వెళ్లిపోయారు.

రాజు ముఖం పేలవంగా మారింది. మిగతా ఉపాధ్యాయుల ముందు సిగ్గనిపించింది. పిల్లల పశుపాల ఉత్తర్వులను రద్దుచేసి, వాటి కొరకు బడి మానేసిన ఓ పన్నెండేళ్ల వాడిని జీతానికి పెట్టుకున్నాడు. వాడు వాటిని రోజూ శ్రద్ధగా మేతకు తీసుకువెళుతున్నాడు. గొర్రెలు, మేకల సంతతి వృద్ధి అవుతుండడం రాజుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

ఒకరోజు, పాఠశాల జరుగుతోంది. తెల్లటి అంబాసిడర్ వచ్చి గేట్ వద్ద ఆగింది. కారును చూడగానే, ఉపాధ్యాయులందరూ అలర్ట్ అయ్యారు. ఓపెన్ అయిన ఫ్రంట్ డోర్ లోంచి టక్ చేసుకుని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్న వ్యక్తి దిగాడు. బ్యాక్ డోర్‌లోంచి మండల విద్యాధికారి, వెనకాల రాజు అపాయింట్ చేసుకున్న గొర్రెల కాపరి దిగారు. వారు బడిలోకి వస్తున్నప్పుడే రాజు గుండెల్లో ప్రమాద ఘంటికలు ఆగకుండా






మ్రోగాయి.

''ఆశారాజు...సార్ మన సర్వశిక్షా అభియాన్ ప్రోగ్రామ్‌కు స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్.పి.డి)'' అని చెబుతూనే, ''ఇతనే సార్ హెడ్‌మాస్టర్.... ఆ మేకలు, గొర్రెలు ఇతనివే....'' కంగారు పడుతూ చెప్పాడు ఎంఇఓ.

ఎస్‌పిడి హెడ్‌మాస్టర్ ఛైర్‌లో కూర్చున్నాడు. ''సీ మిస్టర్ రాజూ.... మేకలు, గొర్రెలు పెంచుతున్నావా?''

రాజు గొంతులో తడారింది. ''అ...వు...ను...సార్'' అప్పటికే ఒంటినిండా చెమటలు...

''ఒక ఉపాధ్యాయుడివై వుండి పద్నాలుగేళ్ల కూడా దాటని ఈ పిల్లవాడిని బాలకార్మికుడిగా మారుస్తావా....?''

''సార్....అతడిని బడికి పంపమని వాళ్ల తల్లి దండ్రులను ఎన్నోసార్లు అడిగాం. రెసిడెన్షియల్ బ్రిడ్జి సెంటర్‌లో చేరుద్దామని కూడా ప్రయత్నించాం. కానీ వారు ఒప్పుకోలేదు....''

''డోన్టాక్ రబ్బిష్.... నీ స్వార్థం కోసం వాడి భవిష్యత్తును బలి చేస్తావా? ఎంఇఓ గారు ఇతని సస్పెన్షన్ ప్రపోజల్స్ తయారుచేసి డిఇఓ గారికి పంపండి.''అని సీట్లోంచి లేచి కారువైపు నడిచాడు.

''ఓకే సార్....ఇమ్మీడియెట్‌గా తయారు చేస్తాను.'' అని మళ్లీ మళ్లీ చెబుతూనే.... ఆ ఉన్నతాధికారిని సాగనంపాడు ఎంఇవో

ఆయన వెళ్లాక వెనక్కి తిరిగి బడిలోకి వచ్చి, '' కొంచెమైనా బుద్ధుందయ్యా.... వాడికా మేకల్నిచ్చి పంపావు. వాడేమో రోడ్డు పక్కనే మేపుతూ కార్లో వెళుతున్న ఆయన దృష్టిలో పడ్డాడు. అడగంగానే వివరాలన్నీ చెప్పాడట. వాడిని ఎక్కించుకొని సరాసరి నా ఆఫీసుకొచ్చాడాయన. ఇప్పుడు 'ఎఫెక్టు' నీకు కొట్టింది. ముందు ముందు నాకేమవుతుందో.... ఎంఇవో వెళ్లిపోయాడు.

సస్పెన్షన్ వుత్తర్వులు చేతిలో పడ్డాయి. మనసులో రోదిస్తూనే జీవాలన్నీ అమ్మేశాడు. విచారణ, ఇంక్రిమెంటు కోత నేపథ్యంలో కొంత కాలానికి రాజు మళ్లీ బడిలో చేరాడు.

ఈ రెండు భారీ ప్రకంపనల తర్వాత కూడా రాజు లక్ష్యంలో మార్పు రాలేదు. లక్షల కట్టలు కళ్లారా చూడాలనేది జీవిత పరమార్థం! స్నేహితులో సలహా నిచ్చారు. అదో సువర్ణావకాశం అనుకున్నాడు. రిస్క్‌ను అంచనా వేశాడు ఎలా చూసినా నష్టమొచ్చే అవకాశం స్వల్పమనిపించింది. వెంటనే కార్యరంగంలోకి దూకాడు. పాఠశాలకు రెండు రోజులు సెలవొచ్చినప్పుడు బెంగుళూరు లోని ఓ టేకు చెట్ల నర్సరీకి వెళ్లాడు. తను ఎప్పుడో కొనిపెట్టిన పదెకరాల మెట్ట పొలంలో టేకు చెట్ల సాగులో చెట్లకు డబ్బులు మొలిపించాలనేది రాజు ప్రణాళిక. బేరం చేసి ఒకటికి రెండు సార్లు అనుమానాలు తీర్చుకొని ఓ ఐదొందల టిష్యూ కల్చర్ మొక్కల్ని కొనుగోలు చేసి తీసుకొచ్చాడు.

పొలం బాగా దున్నించి వాటిని నాటాడు. బోర్‌లోని పాడైపోయిన మోటార్ తీసేసి కొత్త మోటార్ బిగించాడు. టేకు చెట్లసాగు మొదలైంది. నర్సరీ వాళ్లు చెప్పిన ప్రకారం అవి పదేళ్లకు కోతకు సిద్ధమవుతాయి. విచిత్రంగా మూడు నాలుగేళ్లకే 'ఇంతితై వటుడింతై' అన్న చందంగా విపరీతంగా పెరిగాయి.

రాజు సంతోషానికి పగ్గాలు లేక పోయాయి. అయితే మనసులో ఏదో మూల చిన్న సందేహం మాత్రం వుంది. ఫోన్ చేసి మొక్కలు అమ్మిన వారిని అడిగాడు. అనుకూల పరిస్థితుల్లో ఊహించనంతగా పెరగడం సహజమేనన్నారు వాళ్లు. కొట్టేసి అమ్మేయ వచ్చని సలహా కూడా ఇచ్చారు.

ఇన్నాళ్లకు ధనయోగం ప్రాప్తించినందుకు సంతోషించాడు రాజు. అన్నింటిని నరికించి అమ్మకానికి సిద్ధం చేశాడు. కొనడానికి వచ్చినవారు కలపను పరిశీలించారు. వారికెందుకో తేడాగా అనిపించింది. ''రాజుగారూ... రేపు ఓ మిత్రుడ్ని తీసుకొచ్చి పరిశీలింప చేశాక మీకు అడ్వాన్స్ ఇవ్వగలం'' అని చెప్పి వెళ్లారు.

మరుసటి రోజు వారితో పాటు ఓ నిపుణుడు వచ్చారు. అతను కాస్త కలప ముక్కను కట్ చేసి పరిశీలించాక పెదవి విరిచాడు. ఆ విరుపు రాజు అరుపుకు ప్రాతిపదిక అయింది. అవును మరి! 'టిష్యూ కల్చర్ మరియు జన్యు పరిజ్ఞానంలో తయారైన మొక్కలవడంతో... ఎక్కడో జన్యు నిర్మాణంలో లోపం జరిగి చెట్లు విపరీతంగా పెరిగాయే తప్ప కలప గట్టిగాలేదని,.... అది వంట చెరకుగా తప్ప, ఇంటి సామాగ్రికి పని కిరాదని' తేల్చాడా వృక్షనిపుణుడు. కన్నీటిని ఆపుకుంటూనే అమ్మకానికి విఫలయత్నాలు చేసి చివరకు ఇటుక బట్టీల వారికి అమ్మేశాడురాజు.

★★★

గతం పూర్తయ్యింది. ఇన్ని అనుభవాల తర్వాత ఈ రోజు చదివిన ప్రకటన అతనిలోని ఆశయానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసింది. ఇది తన చివరి ప్రయత్నమని గట్టిగానే తీర్మానించుకున్నాడు. తన ఇంటి పక్కనే వున్న ఖాళీ స్థలాన్ని కొని, కంతలు లేకుండా చుట్టూ వెదురుతో దడి కట్టించాడు. అందులోనే చిన్న పాకను వేయించాడు. రాజు పనులు ముందు ఎవరికీ అర్థంకాలేదు. నివాస ప్రాంతాన్ని ఏర్పాటు చేశాక అందులోకి ఓ యాభై కుందేళ్లను తెచ్చి వదిలాడు. మరి ఆయనను ఆకర్షించిన ప్రకటన 'కుందేళ్లతో కుబేరులైపోండి'

వాటి తిండీ, తిప్పలు, సామాగ్రిని ఏర్పాటు చేశాక, రోజూ సాయంకాలం వాటి ఆలనాపాలనా చూడసాగాడు. కొత్త పెంపకం అందరికీ వింతగానే ఉంది. కుందేళ్ల సంఖ్య చకచకా పెరిగిపోయింది. వాటిని ఎక్స్‌పోర్ట్ చేయడం.... మాంసం మార్కెట్లలో అమ్మకంతో ఆదాయం గణనీయంగా పెరిగింది. రెండు చేతులా డబ్బు వస్తోంది. రాజు విజయగాథ ఆ నోటా ఈ నోటా పడి టివి10.5 వారి దృష్టికి వచ్చింది.

ఓ శుభముహూర్తాన టివి10.5 సిబ్బందిరాజు ముందు వాలింది. మాష్టారికి ఎంతో సంతోషం వేసింది. తన వైఫల్యాల చిట్టా మొత్తం విప్పి పట్టుదల, ఆత్మవిశ్వాసాలే తన విజయానికి కారణమని నొక్కి చెప్పాడు.

మరుసటి రోజు ఆసక్తిగా టివి10.5 న్యూస్ పెట్టాడు ఆశారాజు. తన ముఖం తెరపై కనపడగానే ఎక్కడలేని ఉద్వేగం వచ్చింది. తన మాటలు ఏమాత్రం 'ఎడిట్' చేయకుండా వచ్చాయి. తను చెప్పడం పూర్తయిన వెంటనే 'న్యూస్ రిపోర్టర్' తెరపైకి వచ్చింది.

''చూశారుగా.... ఒక కోణంలో ఇది ఘనవిజ

యమని నమ్మవొచ్చు. 'మానవీయత కోణం'లో పరిశీలిస్తే వన్యప్రాణులైన కుందేళ్లను మాంసాహారులకు రుచి చూపించి, వాటి జాతి అంతరించిపోయేందుకు మొదటి మెట్టు వేసిన వాడిగా రాజుగారిని పరిగణించవచ్చు.... ఎనీహౌ.... ఏం చేసినా డబ్బు సంపాదించాలనే పెడధోరణులు సమాజంలో పెరిగిపోతున్నాయనేందుకు ఈ సంఘటన ఓ ఉదాహరణ. కుందేళ్ల పెంపక కేంద్రం నుంచి కెమెరామన్ అజ్ఞాత్‌తో కలిసి బహుకోణ టివి10.5'' న్యూస్ అయిపోయింది.

అది చూసిన రాజు బిత్తరపోయాడు. 'దృష్టిని బట్టే దోషం' అని తనను తాను సమర్ధించుకున్నాడు. ఆ విషయాన్ని వెంటనే మర్చిపోయాడు.

రెండు రోజుల తరువాత టివి ప్రసార ప్రకంపనాలు మొదలయ్యాయి. ఆరోజు ఉదయాన్నే ఒకదాని వెంట మరొకటి నాలుగు వాహనాలు వచ్చి రాజు ఇంటి ముందు ఆగాయి. అందులో ఒకటి 'జంతు కారుణ్య సంఘం', రెండవది 'వన్యప్రాణి సంరక్షణా విభాగం', మూడవది 'జంతు హక్కుల సంఘం', నాలుగవది 'శాకాహార ప్రోత్సాహక సమితి' వాళ్లవి.

రాజును బలవంత పెట్టి ఊరి రచ్చబండ వద్దకు తీసుకెళ్లి గ్రామస్తులందరినీ పిలిచారు.

'జంతువులు మన పిల్లల్లాంటివి. వాటి పట్ల మనం ప్రేమను చూపాలే గాని వైషమ్యాన్ని కాదు. వాటిని అంగడి సరుకుగా చేసి రాజు చేసిన తప్పు ఎప్పటికీ క్షమించరానిది. కారుణ్యం కాస్త కూడా లేకుండా ఉపాధ్యాయుడిగా వున్న ఇతను వృత్తికే అనర్హుడు' కారుణ్య సంఘం వారి మాటలు పూర్తికాగానే....

'కుందేళ్లు వన్యప్రాణులు... వన్యప్రాణి సంరక్షణా చట్టం లోని ఓ సెక్షన్ ప్రకారం వాటిని పెంచడం, అమ్మడం, ఆహారానికి వినియోగించడం తీవ్రమైన నేరం. ఈ తప్పుకు ఇంకో సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేస్తున్నాం.' వన్యప్రాణి సంరక్షణాధికారి ఆవేశంగా చెప్పాడు.

ఆయన కాస్త గ్యాప్ ఇవ్వగానే, 'మన మనుషులకే కాదు...జంతువులకూ హక్కులుంటాయి. స్వేచ్ఛ,సమానత్వం లాంటి రాజ్యాంగ హక్కులన్నీ మనుషులకే అనుకునే వారు మూర్ఖులు. ప్రతి ప్రాణికీ పుట్టుకతోనే హక్కులు వస్తాయి. స్వేచ్ఛగా బ్రతికే చిన్నారి కుందేళ్లను కసాయి కత్తికి బలిచేస్తోన్న ఇతన ప్రాథమిక హక్కు రద్దు చేయాల్సిందిగా రాష్ట్రపతికి విజ్ఞాపన పంపుతున్నాము' జంతు హక్కుల కార్యకర్త అలసిపోగానే....

'మాంసాన్ని తినడం జ్ఞానం లేని వారి చర్య. మనిషి తెలివిని, వివేచనను కలిగి వుండాలంటే శాకాహారమే ఉత్తమమని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఉద్రేకాన్ని కలిగించే మాంసాహారాన్ని ప్రోత్సహిస్తోన్న ఇలాంటి వ్యక్తితో మాట్లాడకుండా ప్రతి శాకాహారి తనకు తాను స్వయం నిబంధన విధించుకోవల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను' శాకాహార సమితి కార్యకర్త ఉద్రేకంగా అన్నాడు.

అందరి ప్రసంగాలు పూర్తయ్యాయి. ప్రజలంతా రాజు ఏదో అనైతిక పని చేయబట్టే ఇంతమంది ముందు దోషిగా నిలబడ్డాడని నమ్మారు. నాలుగు సంఘాల వారు కాసేపు చర్చించి చివరికో నిర్ణయానికొచ్చారు. 'నాలుగు రకాల కేసులు నమోదు చేయించి అందరి సమక్షంలో కుందేళ్లకు స్వేచ్ఛను కల్పించాలి' అదే నిర్ణయం.!

రాజు విజ్ఞప్తిని ఏ మాత్రం ఖాతరు చేయకుండా...శాంతి కపోతాలు ఎగరేసినట్లు తలా ఒక కుందేలును ఊరి పక్కనే వున్న అడవిలోకి వదిలేశారు. లబోదిబోమంటున్నా ఓదార్చేవారు లేకపోయారు.

★★★

ప్రస్తుతం.... ఆశారాజు కేసులన్నింటినుంచీ విముక్తుడయ్యాడు. ఆయన మదిలో వ్యాపారమంటేనే అసహ్యమేర్పడింది. వ్యాపారం అచ్చిరాలేదనుకున్నాడు. స్కూలుకు రెగ్యులర్‌గా వెళ్లసాగాడు. ఇతర వ్యాపకాలు లేకపోవడంతో బోధన పట్ల ఆసక్తి పెరిగింది. బోధనలో నూతన విధానాలు ప్రవేశపెట్టడమే కాక విద్యార్థులలో క్రమశిక్షణను కూడా పెంచాడు. పిల్లల్లో పెరుగుతున్న చురుకుదనం, జ్ఞానాన్ని గమనిస్తే వారే ధనరాశులుగా తోచారు. వికాసం చెందిన ఆశారాజు విద్యార్థులకు ఆశాదీపం అయ్యాడు.

★

## ఇక పిల్లల్ని కంటాను!

ప్రేమించినంత వరకూ చాలు.. పెళ్లిళ్లు ఇక వెగటు పుట్టాయి. కావాలనుకున్నప్పుడల్లా మొగుళ్లను మార్చాను. మళ్లీ వద్దన్నాను. మళ్లీ చేసుకున్నాను. ఇవన్నీ ఇప్పుడు బోరుకొట్టాయి బాబూ. ఇక పిల్లల్ని కనాలని వుంది అంటూ చెబుతున్నది ఎవరో కాదు, ప్రముఖ పాప్‌సింగర్ జెన్నిఫర్ లోపెజ్. సెక్స్ సింబల్‌గా ప్రపంచవ్యాప్తంగా ముద్రవేయించుకున్న జెలో ఇప్పుడు తల్లి కావాలని ఆశపడుతోంది పాపం. మార్క్ ఆంథోని, ఒజాని నోవా, మొగల్ డిడ్డీ వీళ్లందరూ మొగుళ్లే. రెండున్నరేళ్ల నుంచి క్రితం బెన్ అఫ్లెక్‌తో జట్టు కట్టి డేటింగ్ చేస్తోంది. సుమారు 22 సినిమాల్లో నటించింది. చాలా ఆల్బమ్‌లు చేసింది. ఇవన్నీ ట్రాక్ రికార్డుకు మాత్రమే... సంతోషంగా వుండాలంటే పిల్లల్ను కనాల్సిందే అంటోంది జెలో. మరి ఎవరితో కంటుందనేదే ఇప్పుడు అసలు సంగతి అంటున్నారు హాలీవుడ్‌లో...!

